క్లుప్తంగా

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

అరసవల్లి: శ్రీకాకుళం–ఆమదాలవలస రహదారి విస్తరణ పనులు జరుగుతున్న క్రమంలో రాగోలులో శుక్రవారం ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నారు. ఈ మేరకు ఆపరేషన్స్ ఈఈ బయ్యన్నాయుడు, డిప్యూటీ ఈఈ రాంబాబు బుధవారం తెలియజేశారు.

సంతవురిటిలో ఉచిత వైద్య శిబిరం



రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

జి.సిగడాం: సంతవురిటి గ్రామంలో బుధవారం జెమ్స్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. స్థానిక సర్పంచ్ బుడారి లక్ష్మణరావు శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. వైద్యులు రోగులను పరీక్షించి మందులు అందజేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు బత్తుల సన్యాసిరావు, వైద్యాధికారి జోత్స్న, ఎందువ ఉమాశంకర్ ఉన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు



పిల్లలకు వైద్య పరీక్షలు చేస్తున్న దృశ్యం

ఎచ్చెర్ల: విద్యార్థులు ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలని తోటపాలెం, కొంగరాం గ్రామాల వైఎస్సార్ విలేజ్ హెల్త్‌క్లినిక్‌ల హెల్త్ అసిస్టెంట్ ఇప్పిలి చిట్టిబాబు అన్నారు. పొన్నాడ ప్రాథమిక కేంద్రం పరిధి దుప్పలవలసలో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులంలోని విద్యార్థులకు బుధవారం వైద్య పరీక్షలు చేశారు. వర్షాలు పడుతున్నందున వేడిచేసి చల్లార్చిన నీటిని తాగాలని విద్యార్థులకు సూచించారు. ప్రిన్సిపాల్ దేవేంద్రరావు, స్కూల్ హెల్త్ వలంటీర్ సురేంద్ర ఉన్నారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు



చల్లపేటలో ఏర్పాటు చేసిన పవర్ ట్రాన్స్‌ఫార్మర్

అరసవల్లి: గార మండలం చల్లపేట సబ్‌స్టేషన్‌లో ఇటీవల 5 ఎం.వి.ఎ పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశామని విద్యుత్ శాఖ ఎస్ఈ ఎల్.దైవప్రసాద్ తెలియజేశారు. బుధవారం ఆయన 'సాక్షి'తో మాట్లాడారు. చల్లపేట సబ్ స్టేషన్‌లో ఇటీవల 5 ఎం.వి.ఎ పవర్ ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోవడంతో ఆ పరిధిలోని 50 గ్రామాలకు విద్యుత్ సరఫరాలో తీవ్ర అంతరాయాలు చోటుచేసుకున్నాయన్నారు. ఇందుకు ప్రత్యామ్నాయంగా తూలుగు సబ్‌స్టేషన్‌లోని ఉన్న పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను చల్లపేటలో ఏర్పాటు చేశామన్నారు. కొత్త పవర్ ట్రాన్స్‌ఫార్మర్ కోసం ఉన్నతాధికారులకు నివేదించామన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



పనులకు భూమిపూజ చేస్తున్న చిరంజీవి

ఎచ్చెర్ల క్యాంపస్: ధర్మవరం గ్రామంలో మండల పరిషత్ నిధులు రూ.4 లక్షలతో చేపట్టనున్న సిమెంట్‌రోడ్డు, డ్రైనేజ్ నిర్మాణ పనులను ఎంపీపీ మొదలవలస చిరంజీవి బుధవారం ప్రారంభించారు. పనులను నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ సకాలంలో పూర్తిచేయాలని గుత్తేదారులకు సూచించారు. ఎంపీటీసీ సభ్యుడు బగ్గ రాజారావు పాల్గొన్నారు.

స్వామిత్వ సర్వేకు సహకరించాలి



స్వామిత్వ సర్వే గురించి మ్యాప్ ద్వారా తెలియజేస్తున్న సిబ్బంది

లావేరు: స్వామిత్వ సర్వేకు సహకరించాలని వైఎస్సార్‌సీపీ మండల ప్రధాన కార్యదర్శి దేశెట్టి తిరుపతిరావు, తాళ్లవలస పంచాయతీ కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు అన్నారు. రావివలస గ్రామంలో జరగనున్న స్వామిత్వ సర్వేపై బుధవారం గ్రామ సభ నిర్వహించారు. మ్యాప్ ద్వారా సర్వేపై సభలో గ్రామస్తులకు అవగాహన కల్పించారు. రావివలస గ్రామంలో గురువారం నుంచి స్వామిత్వ సర్వే జరుగుతుందని.. టీమ్ సభ్యులకు స్థానికులు సహకరించాలన్నారు. గ్రామంలోని ఇళ్లు, ఖాళీ స్థలాలు గురించి సర్వే చేస్తారన్నారు.

మాతా, శిశు సంరక్షణే ప్రభుత్వ ధ్యేయం

- పౌష్టికాహార కిట్లు పంపిణీలో మంత్రి ధర్మాన ప్రసాదరావు



శ్రీకాకుళం రూరల్: లబ్ధిదారులను దీవిస్తున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు



రణస్థలం: వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను అందజేస్తున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

శ్రీకాకుళం రూరల్:

మాతా, శిశు సంరక్షణే ప్రభుత్వధ్యేయమని మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. పెదపాడులోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహార కిట్లను బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ గర్భిణులు, బాలింతలకు ఇంటికే నేరుగా రేషన్‌ను అందించడం జరుగుతోందన్నారు. తల్లీపిల్లలు ఆరోగ్యంగా ఉండాలని ప్రభుత్వం ఈ కార్యక్రమం చేపడుతుందన్నారు. ఆరోగ్య సమాజ రూపకల్పనే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమన్నారు. సినిమాల్లో నటించే వారికి సమాజంలో జరిగేవి ఏవీ తెలియవన్నారు. వలంటీర్ల సేవలు కావాలని ప్రజలు అంటుంటే తాము అధికారంలోకి వచ్చాక తీసేస్తాం, ఈ వ్యవస్థను రద్దుచేస్తామని విపక్ష నాయకులు అంటున్నారని ధ్వజమెత్తారు. మీకు మేలు చేసే ప్రభుత్వానికి మద్దతుగా నిలవాలని కోరారు. గార సీడీపీఓ రాధామాధవి మాట్లాడుతూ ఒక్కో గర్భిణికి పౌష్టికాహారం పంపిణీ కోసం నెలకు రూ.900 చొప్పున ప్రభుత్వం ఖర్చు చేస్తోందన్నారు. గార ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో 1810 మంది గర్భిణులు, బాలింతలు ఉన్నారన్నారు. అనంతరం సామూహిక సీమంతాలను నిర్వహించారు. కళింగ కోమటి కార్పొరేషన్ చైర్మన్ అంధవరపు సూరిబాబు, జిల్లా రైతు విభాగం అధ్యక్షుడు అంబటి శ్రీనివాసరావు, ఎంపీపీలు గొండు రఘురామ్, అంబటి నిర్మల, జెడ్పీటీసీ రుప్ప దివ్య తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం నగరంలో..

శ్రీకాకుళం అర్బన్: అంగన్‌వాడీ కార్యకర్తల ద్వారా పౌష్టికాహారం అందించే కార్యక్రమానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర వ్యాప్తంగా శ్రీకారం చుట్టారని వైఎస్సార్‌సీపీ నాయకుడు, వార్డు ఇన్‌చార్జి డాక్టర్ పైడి మహేశ్వరరావు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన టి.హెచ్.ఆర్ కార్యక్రమాన్ని నగరంలోని డీసీసీబీ కాలనీ పరిధిలోని కొన్నా వీధి, తుమ్మావీధి, దూదివారి సందు, రైతుబజారు, గారవీధి, పుణ్యపు వీధి, రాచకట్ల వీధి, సున్నపువీధి, తదితర అంగన్‌వాడీ కేంద్రాలలో పౌష్టికాహార కిట్లు పంపిణీ, తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఐసీడీఎస్ పర్యవేక్షకురాలు పి.సీతామహాలక్ష్మి, వార్డ్ ఇన్‌చార్జి పండరీ, సచివాలయ కార్యదర్శి మనీషా తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లు పంపిణీ

శ్రీకాకుళం పాతబస్టాండ్: వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకంలో భాగంగా టేక్ హోం రేషన్ (టీహెచ్ఆర్) కింద సరకుల పంపిణీ కార్యక్రమాన్ని బుధవారం జిల్లా కలెక్టర్ సమావేశ మందిరంలో జిల్లా సంయుక్త కలెక్టర్ ఎం.నవీన్ ప్రారంభించారు. జేసీ మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, ఆరేళ్లలోపు చిన్నారుల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం పౌష్టికాహారం అందజేయడం జరుగుతుందన్నారు. ఇంటికే సరకులు పంపిణీ చేయాలని అధిక శాతం మంది కోరడంతో టేక్ హోం రేషన్‌ను ప్రారంభించాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. అక్రమాలకు తావు లేకుండా ఫేస్ రికగ్నైజేషన్ సిస్టమ్ (ఎఫ్ఆర్ఎస్) ద్వారా సరకులు పంపిణీ చేస్తామన్నారు. ఆరు నెలల నుంచి మూడేళ్ల లోపు చిన్నారులకు కూడా టీహెచ్ఆర్ కింద సరకులు ఇస్తారన్నారు. టీహెచ్ఆర్‌కు విముఖత చూపేవారు పాత పద్ధతిలోనే అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చి భోజనం చేయవచ్చన్నారు. వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్‌లో 3 కిలోల బియ్యం, కిలో కందిపప్పు, అర లీటరు పామాయిల్, 5 లీటర్ల పాలు, 2 కిలోల చోడి పిండి, కిలో అటుకులు, పావు కిలో బెల్లం, పావు కిలో ఖర్జూరం, పావు కిలో వేరుశనగ చిక్కీలు, 25 గుడ్లు అందజేరస్తారు. 6 నెలల నుంచి మూడేళ్ల లోపు చిన్నారులకు రెండున్నర కిలోల బాలామృతం, రెండున్నర లీటర్ల పాలు, 25 గుడ్లు ఇస్తారన్నారు. 3 నుంచి ఆరేళ్ల లోపు చిన్నారులకు అంగన్‌వాడీ కేంద్రంలో మధ్యాహ్న భోజనంతోపాటు ఉడకబెట్టిన గుడ్డు, 100 మిల్లీ లీటర్ల పాలు అందజేస్తారన్నారు. జిల్లా స్త్రీ శిశు సంక్షేమ, సాధికారత అధికారి జి.జయ దేవి, సీడీపీఓ శోభ, రామారావు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.



శ్రీకాకుళం అర్బన్: పౌష్టికాహార కిట్లతో లబ్ధిదారులు, వైఎస్సార్‌సీపీ నాయకులు



గార: టేక్ హోమ్ రేషన్ కార్యక్రమం ప్రారంభిస్తున్న దృశ్యం

పారదర్శకంగా పోషణ పంపిణీ

రణస్థలం: అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలు, బాలింతలు, గర్భిణులకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను పారదర్శకంగా అందించాలని ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. వీటి పంపిణీ కోసం ముఖ గుర్తింపు ప్రక్రియను ప్రవేశపెట్టడం వలన అర్హులకు లబ్ధి చేకూరుతోందన్నారు. మండల కేంద్రంలోని రణస్థలం, లావేరు మండలాల స్త్రీ, శిశు సంక్షేమ శాఖ కార్యాలయ ఆవరణలో అర్హులైన బాలింతలకు, గర్భిణులకు టేక్ హోమ్ రేషన్ కిట్లను బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన వచ్చిన తరువాత బాలింతలు, గర్భిణులు, పిల్లలు ఆరోగ్యంగా ఉండేందుకు సంపూర్ణ పోషణలో నాణ్యమైన పోషకాహారం కలిగిన పాలు, గుడ్లు, బెల్లం, వేరుశనగ చిక్కీలు, రాగి, గోధుమ పిండి, ఎండు ఖర్జురం అందజేస్తున్నట్టు పేర్కొన్నారు. గత ప్రభుత్వంలో అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇటువంటి సంపూర్ణ పోషకాలు అందజేయడం చూశారా అని ప్రశ్నించారు. మన ఆరోగ్యం, మన సంక్షేమం కోసం నిరంతరం శ్రమిస్తున్న సీఎం జగన్‌కు అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పీవో సీహెచ్ ఝాన్సీ, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పిన్నింటి సాయికుమార్, జెడ్పీటీసీ సభ్యుడు టొంపల సీతారాం, వైస్ ఎంపీపీ రాయపురెడ్డి భుజంగరావు, జె.ఆర్.పురం సర్పంచ్ బవిరి రమణ, వైఎస్సార్‌సీపీ మండల నాయకులు మహంతి పెదరామినాయుడు, చిల్ల వెంకటరెడ్డి, పచ్చిగుళ్ల సాయిరాం, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, కార్యకర్తలు ఉన్నారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

ఎచ్చెర్ల క్యాంపస్: పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకంలో భాగంగా కుశాలపురంలో టేక్ హోం రేషన్ పంపిణీ చేశారు. గర్భిణులు, బాలింతలు ఆరోగ్యంగా ఉండాలంటే పౌష్టికాహారం తప్పనిసరన్నారు. గ్రామం యూనిట్‌గా రక్త హీనత లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఐసీడీఎస్, వైద్య సిబ్బంది కలిసి పనిచేయాలని చెప్పారు. ఇంటికే వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లు అందజేయనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఎంపీపీ మొదలవలస చిరంజీవి, ఐసీడీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.



జి.సిగడాం: దవళపేటలో కిట్లను పంపిణీ చేస్తున్న నాయకులు



ఎచ్చెర్ల క్యాంపస్: సంతసీతారాంపురంలో పోషణ కిట్లను అందజేస్తున్న దృశ్యం

జి.సిగడాం: మండలంలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రభుత్వం మంజూరు చేసిన వైఎస్సార్ టేక్ హోమ్ రేషన్ కిట్లను పంపిణీ చేశారు. జి.సిగడాం మండల కేంద్రంలో మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు మీసాల వెంకటరమణ, సర్పంచు ముద్దాడ ఈశ్వరమ్మ, బుడారి లక్ష్మణరావు, సాకేటి నాగరాజు, వడిశ మహేశ్వరరావు, వైస్ ఎంపీపీ తోలేటి వెంకటరావు లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పేడాడ శ్రీరామమూర్తి, బత్తుల సన్యాసిరావు, శ్రీనివాసరావు, కంచరాన రమణరావు, బొడ్డేపల్లి ఉదయ్‌కుమార్, ముద్దాడ గౌరీ, నాయిన సింహాచలం, నారాయణరావు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లిపాల వారోత్సవాలు

ఎచ్చెర్ల క్యాంపస్: సంతసీతారాంపురం, కేశవరావుపేట, ఫరీదుపేట, ఎస్ఎంపురం అంగన్‌వాడీ కేంద్రాల్లో బుధవారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. తల్లిపాల ప్రాధాన్యతను అంగన్‌వాడీ కార్యకర్తలు వివరించారు. పిల్లలకు తప్పని సరిగా తల్లిపాలు ఇవ్వడం ద్వారా వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని వివరించారు. స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొని వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను పంపిణీ చేశారు.

లబ్ధిదారుల చెంతకే అంగన్‌వాడీ సేవలు

గార: ప్రభుత్వం అంగన్‌వాడీల ద్వారా లబ్ధిదారులైన గర్భిణులు, బాలింతల ఇంటి వద్దకే సేవలు అందజేస్తోందని ఎంపీటీసీ గుండ అమ్ములుభాస్కరరావు అన్నారు. శాలిహుండం పంచాయతీలో టేక్ హోమ్ రేషన్ కిట్లు పంపిణీ కార్యక్రమాన్ని బుధవారం ప్రారంభించారు. అంగన్వాడీ కార్యకర్త జయలక్ష్మి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

- లావేరు వైఎస్సార్‌సీపీ శ్రేణులకు ఎమ్మెల్యే కిరణ్‌కుమార్ పిలుపు

లావేరు: వచ్చే శాసనసభ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు పనిచేయాలని ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ పిలుపునిచ్చారు. లావేరులోని ఓ కల్యాణ మండపంలో పార్టీ మండలస్థాయి నాయకులు, కార్యకర్తల సమావేశం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కుల, మత, రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు మంజూరు చేస్తున్న విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన అన్ని హామీలను అమలు చేయడం జరుగుతుందన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రతి ఇంటికి లక్షలాది రూపాయల విలువైన సంక్షేమ పథకాలు మంజూరు కావడం జరిగిందన్నారు. పేదలకు సీఎం జగన్ మంచి చేస్తుంటే చంద్రబాబు ఓర్వలేక తప్పుడు ఆరోపణలు, ప్రచారాలు చేస్తున్నారని వీటిని పార్టీ శ్రేణులు తిప్పికొట్టాలన్నారు. గత పాలకుల హయాంలో సంక్షేమ పథకాలు మంజూరు కావాలంటే టీడీపీ జెండా కడితేనో, ఆ పార్టీలో చేరితేనో మంజూరు చేసేవారన్నారు. నేడు ఆ పరిస్థితికి స్వస్తి పలికి అందరినీ సమానంగా భావించి మంచి పాలన అందిస్తున్న మనసున్న నేత జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి పార్టీకి మద్దతుగా నిలిచేలా చూడాలన్నారు. మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు రొక్కం బాలకృష్ణ, జడ్పీటీసీ సభ్యుడు మీసాల సీతన్నాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు దన్నాన రాజినాయుడు, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు షేక్‌చాన్‌బాషా, జిల్లా వ్యవసాయ సలహామండలి సభ్యుడు గొర్లె అప్పలనాయుడు, రణస్థలం ఎఫ్ఎస్‌సీఎస్ మాజీ అధ్యక్షుడు బొంతు సూర్యనారాయణ, లావేరు పీఏసీఎస్ అధ్యక్షుడు బూరాడ చిన్నారావు, వైస్ ఎంపీపీలు లుకలాపు శ్రీనివాసరావు, అలుపున రమణమ్మ నారాయణరెడ్డి, జేసీఎస్ మండల ఇన్‌చార్జి మీసాల శ్రీనివాసరావు, మహిళా అధ్యక్షురాలు ఎం.విజయలక్ష్మి, సర్పంచ్‌లు,ఎంపీటీసీ సభ్యులు, సచివాలయాల కన్వీనర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

నవరత్నాలతో నలుదిశలా సంక్షేమం

- ఎమ్మెల్యే కిరణ్‌కుమార్
- కుశాలపురంలో 'గడప గడపకు మన ప్రభుత్వం'

ఎచ్చెర్ల క్యాంపస్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న నవరత్నాలతో నలుదిశలా సంక్షేమం చేరువైందని ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ అన్నారు. పేదరిక నిర్మూలనే లక్ష్యంగా రాష్ట్రంలో పాలన సాగుతోందన్నారు. కుశాలపురం గ్రామంలో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలను తెలియజేశారు. రేషన్‌కార్డు వారీగా వర్తించిన లబ్ధిని వివరించి బ్రోచర్లు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నాలుగేళ్లలో సంక్షేమ పథకాలు, నవరత్నాలు అమలు, అభివృద్ధిపై ప్రత్యేక దృష్టిసారించినట్టు పేర్కొన్నారు. గ్రామ సచివాలయ, వలంటీర్ వ్యవస్థ ద్వారా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తున్నట్లు చెప్పారు. ప్రజలకు స్వచ్ఛంద సేవకులుగా పనిచేస్తున్న వలంటీర్ వ్యవస్థపై కావాలని ప్రతిపక్షాలు తప్పుడు ప్రచారం చేయడం తగదన్నారు. గత టీడీపీ పాలనలో జన్మభూమి కమిటీల పేరుతో అనర్హులకు, ఆ పార్టీ వారికి మాత్రమే పథకాలు అందజేశారని అన్నారు. ప్రతిపక్షాలు ఎన్ని పొత్తులు పెట్టుకున్నా రానున్న ఎన్నికల్లో కూడా వారిస్థానం ప్రతిపక్షమేనన్నారు. ప్రజా తీర్పులో మార్పు ఉండదన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మొదలవలస చిరంజీవి, మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితుడు మురళీధర్ బాబా, శ్రీకాకుళం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ఓబులేశు, జేసీఎస్ ఇన్‌చార్జి శ్రీరాములు, పీఏసీఎస్ అధ్యక్షుడు సనపల నారాయణరావు, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు పైడి త్రిమూర్తులు, వెంకన్నగారి శ్రీను, చిగురుపల్లి కృష్ణమూర్తి, పైడి సాంబమూర్తి, పైడి మురళీధర్, చందు, అమ్మనాయుడు, ఆనందరావు, హౌసింగ్ ఏఈ రాజేంద్రప్రసాద్, శ్రీకాకుళం మున్సిపల్ కార్పొరేషన్ ప్లానింగ్ అధికారి సీతారాం, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ దివ్య, వ్యవసాయ అధికారి సురేష్, వెలుగు ఏపీఎం రమణమూర్తి పాల్గొన్నారు.



ప్రజలకు సంక్షేమాన్ని వివరిస్తున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

మణిపూర్‌లో శాంతిని నెలకొల్పాలి



అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలియజేస్తున్న దృశ్యం

రణస్థలం: మణిపూర్‌లో శాంతిభద్రతలు నెలకునేలా కేంద్రం ప్రభుత్వం చొరవ తీసుకోవాలని ఆలిండియా క్రిస్టియన్ కౌన్సిల్ రాష్ట్ర జనరల్ సెక్రటరీ గంజీ ఎజ్రా, రణస్థలం పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.సత్యం, రిటైర్డ్ ప్రిన్సిపాల్ జ్యోతి పెడ్రిక్ కోరారు. మణిపూర్ సంఘటనకు నిరసనగా మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహానికి బుధవారం పూలమాల వేసి అక్కడ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు రణస్థలం పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్వర్యంలో ర్యాలీ చేపట్టారు. తహసీల్దార్ కార్యాలయంలో సూపరింటెండెంట్ సత్యవతికి వినతిపత్రం అందజేశారు. పాస్టర్ అసోసియేషన్ సెక్రటరీ ఎస్.రాంబాబు, ట్రెజరర్ వి.ఏసురత్నం, దళిత నాయకులు దత్తి గోవింద, పల్ల అప్పన్న, ఎస్.పోతయ్య, కె.పైడిరాజు, పల్ల నీలయ్య, కె.సీతప్పడు, ఎల్.రమణ, కొయ్యన కోటి, దుక్క ఆనంద్, ముస్లిం మైనారిటీ నాయకుడు ఖాన్‌సాయిబ్ పాల్గొన్నారు.

పశువులకు లంపీ స్కిన్ వ్యాక్సినేషన్



లంపీ స్కిన్ వ్యాధి నివారణ టీకాలు వేస్తున్న దృశ్యం

గార: పశువులకు వ్యాపించే పలు వ్యాధులను ముందస్తు టీకాల ద్వారానే నివారించవచ్చని జెడ్పీటీసీ మార్పు సుజాతమ్మ అన్నారు. మండల కేంద్రంలో లంపీస్కిన్ వ్యాధి నివారణకు ప్రభుత్వం ఉచితంగా వేస్తున్న ముందస్తు నివారణ టీకాల కార్యక్రమాన్ని బుధవారం పరిశీలించారు. పశుసంవర్ధక శాఖ ఏడీ గొలివి రాజశేఖర్ మాట్లాడుతూ జిల్లా అంతటా నెల రోజులపాటు ఉచిత వ్యాక్సినేషన్ కార్యక్రమం రైతు భరోసా కేంద్రాల పరిధిలో జరుగుతుందన్నారు. పశు వైద్యాధికారులు బి.ప్రవీణ్, ఎస్.కొండబాబు, ఆర్‌బీకే సిబ్బంది పాల్గొన్నారు.

మృతురాలి కుటుంబానికి ఆర్థిక సాయం



సాయాన్ని అందజేస్తున్న సాయికుమార్

జి.సిగడాం: జాడ గ్రామానికి చెందిన పట్నాన అసిరయ్య కుమార్తె రూపవతి ఇటీవల మృతి చెందింది. దీంతో వారి కుటుంబాన్ని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పిన్నింటి సాయికుమార్ బుధవారం పరామర్శించి కొంత ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఎంపీటీసీ సభ్యుడు పెద్ది శ్రీనివాసరావు, నాయకులు అబోతుల జన్నాథం, మీసాల ధానకర్ణ ఉన్నారు.

– నిద్దాం గ్రామానికి చెందిన సీనియర్ వైఎస్సార్‌సీపీ నాయకుడు ఏర్నేన ప్రకాశరావు కోడలు ప్రశాంతి ఇటీవల గుండెపోటుతో మృతి చెందింది. దీంతో ఆమె చిత్రపటానికి సాయికుమార్ తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

31 లోగా నివేదిక ఇవ్వండి

జలుమూరు: చిన్నదూగాం పంచాయతీ పరిధి కాకర్ల చెరువులో విద్యుత్ స్తంభాల ఏర్పాటు, వ్యవసాయనికి అనుమతి ఇవ్వడంపై పూర్తిస్థాయి నివేదిక సమర్పించాలని జిల్లా కలెక్టర్‌ను ఎన్‌జీటీ కోరినట్లు సుప్రీం కోర్టు న్యాయవాది డి.వి.రావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాల ధిక్కరించి చెరువులో ఎంపీ నిధులతో విద్యుత్ స్తంభాల ఏర్పాటు చేశారని, వ్యవసాయానికి అనుమతించారని గరీబ్ గైడ్ సంస్థ మెమో దాఖలు చేసిందన్నారు. దీనిపై ఈ నెల 31న లోగా నివేదిక సమర్పించాలని కలెక్టర్‌ను ఆదేశించిందన్నారు.

పింగళి వెంకయ్య స్ఫూర్తిప్రదాత

శ్రీకాకుళం అర్బన్: జిల్లా కేంద్ర గ్రంథాలయంలో కార్యదర్శి కుమార్‌రాజా ఆధ్వర్యంలో స్వాతంత్ర సమరయోధుడు, జాతీయ పతాక రూపకర్త పింగళి వెంకయ్య జయంతి వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. పింగళి చిత్రపటానికి కుమార్‌రాజా పూలమాల వేసి నివాళులర్పించారు. వందేమాతరం, హోమ్‌రూల్ ఉద్యమం, ఆంధ్రోద్యమం వంటి ప్ర సిద్ధ ఉద్యమాలలో వెంకయ్య ప్రధాన పాత్ర పోషించారన్నారు. కె.చిరంజీవులు, యు.కల్యాణి, ప్రత్యూష, పి.రామమోహన్ తదితరులు పాల్గొన్నారు.

కాకినాడ ఆదిత్యలో..

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళం నగరంలోని కాకినాడ ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాలలో పింగళి వెంకయ్య జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. పింగళి చిత్రపటానికి కళాశాల డైరెక్టర్ బీఎస్ చక్రవర్తి నివాళులచారు. కళాశాల ప్రిన్సిపాల్ కె.శివశంకర్, ఎన్ఎస్ఎస్ పీఓ మజ్జి శ్రీనివాసరావు, లైబ్రేరియన్ కమల్ కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.



ఎచ్చెర్ల క్యాంపస్: ధర్మవరం గ్రంథాలయంలో పింగళికి నివాళులర్పిస్తున్న దృశ్యం



శ్రీకాకుళం అర్బన్: పింగళి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న గ్రంథాలయ కార్యదర్శి కుమార్‌రాజా

ఎచ్చెర్ల క్యాంపస్: జాతీయ జెండా రూప శిల్పి, స్వాతంత్ర్య సమరయోధుడు పింగళి వెంకయ్య 147వ జయంతిని ధర్మవరం గ్రంథాలయంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకయ్య చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. గ్రంథాలయ అధికారి మలిపెద్ది చంద్రశేఖర్‌రావు.. పింగళి గొప్పతనాన్ని విద్యార్థులకు తెలియజేశారు. గ్రంథాలయ సహాయకులు సూర్యనారాయణ, పాఠక కమిటీ సభ్యులు పాల్గొన్నారు.